

# మొదటి పాఠం

సత్యవాడ (బిగేటి) ఇందిరాదేవి

“ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఆపరేషన్ చేయించుకున్నాడుట సీతాపతి. భార్య నానారభసా చేస్తున్నదిట" అన్నది అమ్మ.

తక్కున కాఫీకప్పు కింద పెట్టి “అదేమిటమ్మా! అతను చేసింది మంచిపనేగా—ఆవిడకుమటుకు నలుగురు పిల్లలు చాలరుటనా? ' అని ఆశ్చర్యపోయాను

"సుగుణమ్మగారి ప్రవర్తనకు అర్థం తెలీటల్లేదు. సీతాపతికా ఉద్యోగం లేకపోయె. ఇంటిల్లిపాదీ ఆ ముసలాయన సంపాదనతోనే బతకాల్సివచ్చె పాపం—కోడలంటే హడిలిపోయే ఆ హనుమాయమ్మగారిని చూస్తే జాలేస్తుంది' అన్నది అమ్మ.

''అదేవిఁటి? సీతాపతి ఏదో చిన్న ఉద్యోగం చేసేవాడుగా?'' అని అడిగా.

''ప్చ్—డిగ్రీలున్నవాళ్ళకే ఉద్యోగాలు నిలవటం లేదీ రోజుల్లో—ఇంకా తన మాట వేరే అనుకోవటం దేనికి? ఎప్పుడో

"పోయిందా ఉద్యోగం" అన్నది అమ్మ.

"అయ్యో! అయితే వెంకట్రామయ్య గారి లెక్కలమీదనే నడుస్తోందన్న మాట సంసారం. పైగా భర్త ఆపరేషన్ చేయించుకుంటే సహించలేక పోతున్నదా సుగుణమ్మగారు?"

"నాకోడలు ఇల్లు పీకి పందిరేస్తున్నదండీ, అని హనుమాయమ్మగారి గోల" అంటూ కూరలబుట్టా, కత్తిపీటా ముందుకు లాక్కున్నది అమ్మ.

నామనసు గజిబిజిగా అయిపోయింది.

"ఏమిటో విశేషం? పొద్దున్నే వంటింటో సమావేశం చిత్తగిస్తున్నారు ఇద్దరు మహిళామణులూ — ఇవేళ ఆఫీసువేళకి భోజనప్రాప్తి లేదన్నమాటేనా?" స్వగతం పలుక్కుంటూ టవల్‌తో మొహం తుడుచుకుంటూ వచ్చాడు అన్నయ్య.

"ఓహో — ముఖ ప్రక్షాళనం పూర్తి చేశారా సోదర మహాశయా! సుప్రభాతం మేము లోక వ్యవహారాలు పరిశీలిస్తున్నాంలే" అని నవ్వుతూ కాఫీ ఇచ్చా.

"హతోస్మి. అయితే తొందరగా నాదారి నన్ను చూసుకోమంటావా ఏ హోటల్‌కో.........నాన్నగారేమో క్యాంప్ వించీ మధ్యాహ్నంగాని రారాయె." అంటున్న అన్నయ్యకు అడ్డువచ్చాను.

"ముదితల్ నేర్వగరాని విద్యకలదే ముద్దార నేర్పించినన్ అంటుంటావు కదా అన్నయ్యా! నువ్వెప్పుడూ"

"అంటే — తమరింకా కొత్త విద్య ఏమైనా అభ్యసించాలా తల్లీ?"

"అబ్బ! వేళాకోళం కాదన్నయ్యా! సీరియస్‌గా అడుగుతున్నా. ఆమాట నిజమేనా అని!"

"ఆహా! పచ్చి నిజం ఎదురుగుండా చదువుల సరస్వతివి నువ్వు కన్పిస్తుంటే కాదని ఎలా అనమంటావు?"

"నేనా? నేనూ?........"

"ఊఁ నువ్వు........?"

"అన్ని అవకాశాలూ ఉండబట్టే చదువుకో గలిగానేమో అనిపిస్తున్నది. ఏ అవకాశమూ లేనిస్త్రీలు........"

"ప్చ్ అందుకేగదమ్మాయ్! జాతికి రత్నదీపికలైన మన ఆడవాళ్ళు ఎందరో నాలుగు గోడలమధ్య మగ్గిపోయారు" అని నిట్టూర్చాడు అన్నయ్య.

"నా కొక పని చెయ్యాలని వున్నదన్నయ్యా! నీ ప్రోత్సాహం....వుంటుందిగా?" కుతూహలంగా చూశాను.

"ఆహా! మా బంగారుచెల్లాయికి ప్రోత్సాహమే ఏంఖర్మ? సహాయంకూడా వుంటుంది. ఇంతకీ ఏమిటో అమ్మాయిగారు తలపెట్టిన ఆ మహత్కార్యం?" ఉత్సాహపడ్డాడన్నయ్య.

"ఒక్క సహాయమే ఏంఖర్మ! చెల్లాయికి, అవసరంపడితే పెద్ద గంపెడు సానుభూతికూడా వుంటుంది సరేగానీ నావంట అయిపోతోంది మీ స్నానాలూ టాయిలెట్లే ఆలస్యం — లోకోద్ధరణ

కార్యక్రమాలూ చర్చా వేదికలూ తర్వాత నిర్వహిద్దురుగాని అన్నగారూ చెల్లెలూమా '' అన్నది అమ్మ

''అన్నట్టు చెప్పడం మర్చిపోయాను నేను ఆఫీసునించీ వచ్చేటప్పటికి రెడీగా వుండండి నాన్నగారు మధ్యాహ్నం వచ్చేస్తారుగా—నలుగురం సరదాగా అలా వెళ్దాం'' అన్నాడు అన్నయ్య.

''అమ్మా—సాయంత్రం సినిమా కెళ్ళాలిగాని ఇప్పుడు తొందరగా వంట కానియ్యవే'' అని గారాలు కుడిచా నేను.

'నీ తొందర దొంగల్దోలా'' అని నవ్వుకుంది అమ్మ

నేను నాగదిలోకి వచ్చేశాను కానీ నా మనసులో ఆ వూహే మెదులుతున్నది

* *

హనుమాయమ్మగారూ వెంకట్రామయ్యగారూ ఆదర్శదంపతులు, ముందు పుట్టిన అయిదారుగురు పిల్లలూ వరస వరసనే చచ్చిపోగా సీతాపతి ఒక్కడే మిగిలాడు వాళ్ళకి. అందుకే వంశాంకుర మని అతన్ని అల్లారుముద్దుగా పెంచుకున్నారు, వాళ్ళూ మేమూ చిన్నప్పట్నించీ స్నేహితులమే. సీతాపతీ నేనూ ఒకటో క్లాసునించీ ఎస్ ఎస్. ఎల్ సీ వరకూ కలిసి చదువుకున్నాం అతను నాకంటే నాలుగైదేళ్ళు పెద్ద నాకంటే ఏమిటి! మా అన్నయ్యకంటేనే రెండేళ్ళు పెద్ద సహజంగా చురుకుపాలు తక్కువ దానికి తోడు అతిగారాబం — ఫిఫ్త్‌ఫారందాకా ఎలాగో నెట్టుకొచ్చాడు—

నేనుమటుకు ఏం తక్కువతిన్నాను!

"అమ్మా! మరే సీతాపతీ నాగరత్నం వాళ్ళంతా హాయిగా ఆడుకుంటున్నారు, నేను కూడా వెళ్తానే' అని బ్రతిమాలే దాన్ని అమ్మని ఆశగా చూస్తూ—

"ఆడుకుందువుగాని తల్లీ! వ్యాయామానికి పనికివచ్చే ఆటలు అదీసాయంత్రం పూటమటుకే — ఈవేళప్పుడు ఆడుకో కూడదు మా బంగారుతల్లివికదూ! ఆ పాఠమేదో అర్థం కాలేదన్నావుగా—నేను చెప్తానిలా పట్టుకురా—అది పూర్తయ్యాక చక్కగా తలదువ్వి నిన్ను అలంకరించి ఇంచక్కా మిఠాయి పెడతాను ఏం!'' అని నచ్చచెప్పి లాలించి స్వీట్స్ పెడతానని ఆశపెట్టి, బ్రతిమలాడి నన్ను చదివించేది అమ్మ. థర్డ్‌ఫారం దాకా నాకు చదువుమీద సరిగ్గా దృష్టి ఏర్పడలేదు అమ్మ ఎంత తాపత్రయపడినా.

"సీతాపతివాళ్ళంతా హాయిగా సినిమాలు చూస్తారు ఇష్టంవచ్చినట్లు ఆడుకుంటారు. నన్నుమటుకు పొద్దస్తమానం ఈ పుస్తకాలు పట్టుక్కూచోమంటావు బోర్ కొడుతోంది'' అని అమ్మమీద ఎగిరానొక రోజు

అమ్మ నా వంక విశతంగా చూసింది. ఆ చూపును ఎప్పటికీ మర్చిపోలేను నేను. ''రాణీ! చెప్పిన మాట విని బాగుపడు తల్లీ! విద్యార్థివమ్మా నువ్వు రకరకాల వ్యామోహాలకూ లొంగిపోకూడదే.

సీతాపతి వేరూ, నువ్వువేరూ, తాశీల్దారుగారి సుబ్బలక్ష్మి వేరూనూ—మనం కేవలం మధ్య తరగతి వాళ్ళం. పెద్దలు సంపాయించి పెట్టిన ఆస్తి చిల్లిగవ్వ కూడా లేదు వెనకాల. మీ నాన్నగారి రెక్కాడితే గాని మన కడుపు నిండదు. ఆయనకు ఒక్కనెల జీతం రాకపోతే వుంటై మన పాట్లు—నీకూ అన్నయ్యకీ మే మేమీ ఆస్తి సంపాయించి యివ్వలేం గదా. కనీసం మీకాళ్ళమీద మీరు నిలబడేటట్లు ....మీ బ్రతుకు మీరు బ్రతికేటట్లు చెయ్యగలిగితే కన్నందుకు మా బాధ్యత కొంతయినా తీరుతుంది. చచ్చిపోయేటప్పుడు మమ్మల్ని తృప్తిగావుండ నీవే'' చివరి మాట అంటుండగా అమ్మ కంఠం రుద్ధమైంది.

నా కళ్ళవెంట నీళ్ళు ఉబికాయి.


''అమ్మా!'' అన్నా ఆవేదనగా.

''నేను ఇంకోమాట చెబుతున్నా విను. నిన్ను కేవలం డబ్బు సంపాదనకే చదివిస్తున్నామనుకోకు. సంఘంలో సంస్కారంగల మనిషివి కావాలి నువ్వు! నీ విద్యా వివేకాలతో యిటు పుట్టినిల్లూ—అటు మెట్టినిల్లూ ప్రకాశించాలి. ఫలానివారి అమ్మాయి ఫలానావారి కోడలు, ఫలానావారి భార్య, ఫలానావారి తల్లి అని నిన్ను ప్రజలు మెచ్చుకోవాలి. 'నీ భర్తకి ఉత్తమ సహచరిగా నీ బిడ్డలకి మంచి తల్లివిగా తయారు కావాలి నువ్వు. అలా ఎప్పుడౌతావో తెలుసా? సంపూర్ణ విద్యావతి వైనప్పుడు. ఉత్తమ విద్య ద్వారా చక్కని ప్రవర్తన అలవడుతుందమ్మా. నిన్నలా తయారు చెయ్యాల్సిన బాధ్యత కన్నతల్లిగా నామీద వున్నది.

అనంతమైన విజ్ఞానాన్ని ఆర్జించి పెట్టేది మనిషి మనిషిలోని మానవత్వాన్ని నిలబెట్టేది చదువు—యిన్ని ప్రయోజనాలున్న చదువు నిర్లక్ష్యంచేసి ఎట్లా బ్రతుకుదామని? ఏం బావుకుందామని తల్లీ! నిన్ను సోమరిపోతుగా, అజ్ఞానిగా తయారుచేసి సంఘాని కప్పగించడం నా కిష్టంలేదు. ఇప్పుడిదంతా ఏమిటో గందరగోళంగా వుంటుంది నీ పసి మనస్సుకి పెద్దదానివౌతున్నకొద్దీ నీకే తెలుస్తుంది ఇప్పుడున్న అవకాశాలను చేజేతులా పాడు చేసుకొని తర్వాత విచారిస్తే లాభంలేదు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టే.

అన్నయ్య చూడు ఎంత చక్కగా చదువుకుంటున్నాడో! మీ రిద్దరూ రెండు రత్నాలమ్మా నాకు. అన్నయ్యలా నువ్వు కూడా బాగా చదువుకోవూ తల్లీ!'' అంటూ నన్ను దగ్గరికి తీసుకుని ముంగురులు సవరించింది అమ్మ.

ఆ మాటల్లో—అమ్మ మొహంలో—వున్న శక్తికి నేను ప్రబలంగా ఆకర్షితురాలినైనాను. గబుక్కున అమ్మ మెడ చుట్టూ చేతులువేసి ''అమ్మా! ఇకనించీ నేను బాగా చదువుకుంటానమ్మా. నువ్వు ఆడుకోమన్నప్పుడే ఆడుకుంటా''




అన్నాను. తన పిల్లలు అభివృద్ధిలోకి రావాలని అమ్మకెంత తపన ?' అని ఆశ్చర్యపోతూ—అంతకుముందు నా ప్రవర్తనకు సిగ్గుపడుతూ.

"నాకు తెలుసు—నాతల్లి బుద్ధిమంతు రాలు" అంటూ నా నుదురు ముద్దు పెట్టు కుంది అమ్మ.

తర్వాత నాలుగేళ్ళకు గాబోలు....

మా యస్. ఎస్. ఎల్. సీ రిజల్టు వచ్చాయి. నేను పాసయ్యాను. మంచి మార్కులు వస్తాయనే నమ్మకం వుంది. సీతాపతి పరీక్ష పోయింది చప్పరించేసి "ఆఁ అనుకుంటున్నదేగా. వెధవ చదువు నేనింక చదవను బాబూ" అన్నాడతను ఆరోజు నేనూ మా అన్నయ్యా సినిమాకి వెళ్తే హాల్లో కన్పించి.

సమాధానంగా సన్నగా నవ్వి వూరుకున్నాడు అన్నయ్య. తనూ అప్పుడే ఇంటర్మీయట్ ప్యాసైనాడు. క్లాసు వచ్చింది.

తను బియ్యేలో నేను ఇంటర్‌లో ఒకేసారి చేరాం. మా నాన్నగారికి అయేదే ప్రమోషన్ వచ్చింది. మా ప్రాణాలు సుఖాన పడ్డాయి. వచ్చిందంతా ఖర్చు పెట్టకుండా జాగ్రత్తగా వాడేది అమ్మ. ప్రతి నెలా నాన్నగారు బ్యాంకిలో డబ్బు వేస్తూండేవారు.

ఆ యేడాదే శ్రావణమాసంలో ఒక రోజున మేళతాళాలతో, ముత్తయిదువలతో కలిసి మా ఇంటికి వచ్చారు హనుమాయమ్మగారు. అమ్మకూ నాకూ బొట్టుపెట్టారు. "వదినగారూ! ఇవాళ మా సీతాపతిని పెళ్ళికొడుకుని చేస్తున్నాం. రేపురాత్రికి పెళ్ళి మా యింట్లోనే. ఈ

రెండురోజులూ మీ కుటుంబమంతా అక్కడే భోజనాలు" అన్నారు. "సరే అయితే మా కుంపట్లు రెండూ అటకమీది కెక్కించెయ్యమంటారా వదినగారూ!" అంటూ నవ్వింది అమ్మ.

"అంతకన్నానా! ఏఁవమ్మా రాణీ! రేపూ ఎల్లుండీ సెలవుపెట్టు కాలేజీకి. ఏడీ మీ అన్నయ్య? లోపలున్నాడా? ఏమయ్యోయ్! చిట్టిబాబూ! చదువు పోతుందని వంకపెడితే కుదరదు సుమా. నీ స్నేహితుడి పెళ్ళికి రావాల్సిందే" అంటూ పిలిచి వెళ్ళిందావిడ. వెంకట్రామయ్యగారు నాన్నగార్నీ అన్నయ్యనీ పిలిచి శుభలేక ఇచ్చారు.

ఆ పెళ్ళికూతురే సుగుణ. పుట్టింటి వాళ్ళు చాలా బీదవాళ్ళు. కూతుర్ని తీసుకొచ్చి యిక్కడే పెళ్ళి చేస్తున్నారు. ఉభయ ఖర్చులూ మగ పెళ్ళివారివే.

పెళ్ళిపీటలమీద వధూవరులను చూసి మటుకు నా మనసు జివ్వుమన్నది. స్త్రీ పక్షపాతం నా రక్తంలోనే వుందేమో మరి. ఎఱ్ఱగా, బక్కపల్చగా, బెదురు చూపులతో పెళ్ళిపీటలమీద కూచున్నది ఆ అమ్మాయి—భగవంతుడా! ఈ జంటను ఆశీర్వదించు అనుకున్నాను. పెళ్ళికూతురికి అన్నివిధాలా వ్యతిరేకంగా వున్నాడు సీతాపతి.

"భర్త మాట ఎట్లావున్నా అత్తమామలు మంచి సమర్థులు అమ్మాయిని ప్రాణంగా చూసుకుంటారు. ఏదో కాస్త పొలమూ—సొంత యిల్లూ కూడా వున్నాయాయె మావఁగారింకా నెలకి మూరో నూటయాభైయ్యో తెస్తూనే వున్నాడు. అత్తగారి ఒంటిమీదున్న ఆ బంగారం కాస్తా ఆవిడ తదనంతరం కోడలికే గదా. ఫరవాలేదు. ఆ పిల్ల సుఖపడుతుంది" అనుకుంటున్నారు పెళ్ళి కొచ్చిన బంధుజనం. నేను ఆశ్చర్య పోయాను—భర్త సరిగ్గా వుండి ఇతర విషయాలు ఎట్లావున్నా చాలునని నా ఉద్దేశం. కానీ ఇక్కడ పరిస్థితి అపసవ్యంగావుంది ఎటొచ్చీ గుడ్డిలో మెల్ల అన్నట్టు, పుట్టింట్లోకంటే ఇక్కడే నయం గదా. తిండికీ బట్టకూ వెతుక్కోనక్కర్లేదు" అని సరిపెట్టుకున్నాను.

గంధపు చెక్కతో చేసిన వేణుగోపాలుడి విగ్రహం నా కానుకగా ఇచ్చాను పెళ్ళికూతురికి. దాన్ని ఎంతో మురిపెంగా చూసింది ఆ అమ్మాయి మా ఇద్దరికీ అప్పుడే పరిచయం అయిందిగానీ తను ఎక్కువ మాట్లాడలేదు. స్నిగ్ధంగా, మధురంగామటుకు చాలాసార్లు నవ్వింది నన్ను చూసి.

చిత్ర మేమిటంటే సీతాపతిని ఏకవచనంతోనే సంబోధించే వాళ్ళం. కొత్త కోడల్నిమటుకు 'గారు' చేర్చి పిలవటం అలవాటైంది. పైగా హనుమాయమ్మగారు కోడల్ని 'సుగుణమ్మా!' అని పిలుస్తారు. మేము కూడా 'సుగుణమ్మగారూ!' అని పిలిచేవాళ్ళం అప్పట్లో నేను వరకిణీ



యువ

కట్టుకుని ఓణీవేసుకునేదాన్ని. ముచ్చటగా రెండు జడలు కూడా వేసుకునేదాన్ని. నా వయస్సులోనే వున్న ఆ పెళ్ళికూతురు మటుకు పెళ్ళైన రెండు నెల్లలోనే అన్వర్ధ నామ ధేయంతో 'సుగుణమ్మ గార'యి పోయింది.

సాధారణంగా నలభై నెంబరు చేనేత చీరలూ, ఎప్పుడన్నా ఒకటీ అరా వాయిల్ చీరలూ కట్టుకునేది. బిగించి జడ వేసుకుని నిండుగా బొట్టూ కాటుకా పెట్టుకుని కాళ్ళకి పసుపు రాసుకునేది. మెళ్ళో నాంతాడూ నల్లపూసలూ, కాళ్ళకు మట్టెలూ, గలగల మంటూ చేతులకి గాజులూ వుండేవి. ఈ ఆహార్యానికితోడు స్పష్టాస్పష్టంగా ద్యోతక మయ్యే దీనరేఖ వుండేది మొహంలో. మేమిద్దరంకలిసి సరదాపడి ఒకసారి ఫొటో తీయించుకున్నాం. అందులో ఆవిడ నాకంటే అయిదారేళ్ళు పెద్దదిగా కన్పించింది. అప్పుడు తెలిసింది నాకు మా యిద్దరికీ ఎంత తేడావుందో.

ఆటపాటలతో—చదువు సంధ్యలతో అమ్మదగ్గిర హాయిగా కాలంగడిపే నాకూ బరువు బాధ్యతలతో, కుటుంబ సమస్య లతో అత్తగారింట కోడలుగావుండే ఆవిడకీ ఆమాత్రం తేడా కనిపించటం అతిశయోక్తంకాదు.

మళ్ళీ శ్రావణం తిరిగివచ్చేసరికల్లా కొడుకు పుట్టాడావిడకి. తొట్లో వేసిన రోజు నేనూ అమ్మా పేరంటానికి వెళ్లాం. ఆవిడలో పరిపూర్ణత్వం, తృప్తీ కొట్టవచ్చి నట్లు కనిపిస్తున్నాయి. ఇంకా తెల్లబడింది మనిషి. తాంబూలం వేసుకున్న పెదవులు వెంకటగిరి జరీ చీర—నడికట్టు. చెవుల్లో దూది. వాత్సల్యంతో మెరుస్తున్న కళ్ళు ఏమిటోగాని నాకు రెప్ప వెయ్యాలనిపించ లేదు. నేను కట్టుకున్న కంచి పట్టుపరికిణీ వేసుకున్న పిల్కావోణీ ముందుకు పడు తున్న జడా చిత్రంగా కనిపించాయి

నన్ను చూసి స్నేహ పిచ్చిలంగా నవ్వి "అదేమిటి అలా చూస్తున్నారు నన్ను? ఇదుగో వీడినీ మీరు చూడవల సింది" అంటూ పిల్లవాణ్ని నా ఒళ్ళో పడుకోబెట్టింది. నేను గాభరాపడ్డాను "అమ్మా? నాకు భయంవేస్తోంది. పసి పిల్లల్ని ఎత్తుకోవటంరాదు" అన్నా మెల్లిగా. అమ్మ నవ్వుతూ బాబును ఎత్తు కొని "నీ ఈడుకల్లా నాకు నువ్వు పుట్టావేరాణీ!" అన్నది. "అబ్బ. పుడితే పుట్టాన్లేగానీ బాబును చూడనీ" అంటూ అమ్మ ఒళ్ళోని పిల్లవాణ్ని పరీక్షగా చూశా అంతా తల్లిపోలికే. సన్నగా తెల్లగా వున్నాడు. అరిచేతులు గులాబీ మొగ్గల్లా ముడుచుకుని వున్నాడు. బోడిగుండు జుట్టు అస్సలులేదు. పల్చని గీతల్లా పెదవులు. చిన్ని సున్నాలానోరూ. కళ్ళు చికిలించి చూస్తున్నాడు. "ఓ యబ్బ! ఇంతోటి మొనగాడూ బయల్దేరాడండీ భూమ్మీద. ఎంత విసుగ్గా పెట్టాడో మొహం. ఏమయ్యా చిన్నవాడా! మే మెవరం ఎత్తుకున్నా మీ అమ్మ ఎత్తు

తున్నట్లులేదా?" అంటూ పాపడిని సుగుణమ్మగారికి అందించింది అమ్మ.

ఆరోజు నేను బాటనీ రికార్డువెయ్యాలి. లేకపోతే మేడమ్ మంత్రాలు చదివేస్తారు "శతమానంభవతి శతాయుః పురుషః ...." అని.

ఏమైతే అయిందను కున్నాను. పసివాణ్ణి ఎత్తుకున్న తొలిచూలు పచ్చి బాలెంతరాలి బొమ్మ వేశాను అర్ధరాత్రిదాకా మేలుకొని.

తర్వాత అయిదేళ్ళు గడిచాయి.

నేను ఎమ్మెస్సీ ప్యాసయ్యాను. అన్నయ్యా—ఐ-ఏ-ఎస్ చేసి మా వూళ్ళోనే ఆఫీసరుగా ఎప్పాయింటయ్యాడు.

సుగుణమ్మగారి కిప్పుడు నలుగురు పిల్లలు. ముగ్గురు మగపిల్లలు. చివరిది అమ్మాయి. మూడునాలుగు నెలలుంటాయి ఆ పిల్లకి. ఆ మధ్య వాళ్ల సొంత ఇల్లు అద్దెకిచ్చేసి మరో చిన్న వాటాలోకి మారిపోయారు. ఆ ఇల్లు మా ఇంటికి చాలా దూరం. చదువూ బాధ్యతాకూడా పెరిగాక నాకు వాళ్ళింటికి వెళ్ళటానికే కుదరటల్లేదు. అమ్మే చెప్తుంటుంది వాళ్ళసంగతులు. వింటున్నపుడు బాధపడేదాన్ని. ఇదేమి అన్యాయం అసలు? ఎంతో డెలికేట్‌గావుండే సుగుణమ్మగారు పరమ గయ్యాళి అయిపోవటమేమిటి? ఇంట్లో పీనమెత్తు పనిముట్టుకోవడం లేదుట. పాపం ముసలి అత్తగారు కోడలికి హడిలిపోతూ, వండవార్చులు చేస్తోందిట ఇంట్లో. పనీ. వంటపనీ. బజారుపనీ ఆఖరికి పిల్లల ఆలనాపాలనా అంతా ఆవిడే చూసుకోవాలిట—పైగా మధ్య మధ్య కోడలిచేత చివాట్లు తింటూ.

నాకేమిటో అంతా అసహజం అన్పించింది సుగుణమ్మగార్ని నేను చూసి రెండేళ్ళు దాటింది తిరుపతిలో ఎమ్మెస్సీ చదువుతున్న రెండేళ్ళూ సెలవులకి ఇంటికిరావటం—మళ్ళీ వెళ్ళి పోవటం-అంతే.

అమ్మ సీతాపతి ఆపరేషనువార్త చెప్పటంతో వెంటనే వెళ్ళి చూసిరావాలన్పించింది. కానీ సాయంత్రం అన్నయ్య పిక్చర్ ప్రోగ్రాం పెట్టాడుగదా.

మర్నాడు పొద్దున—

పిల్లలకి స్వీట్సూ — చిన్నపాపకి ముద్దొచ్చే బుల్లిగౌనూ..కాసిని బొమ్మలూ వగైరా సరంజామాతో వాళ్ళింటికి బయల్దేరాను.

నేను వెళ్ళేటప్పటికి మాంచి కోలాహలంగా వుంది ఇల్లు-పెద్ద వాడొక్కడు మటుకు నీళ్ళు పోయించుకున్నాడట వాళ్ళ మామ్మచేత మిగిలిన వాళ్ళిద్దరూ బట్టలు విప్పుకునే అటూ ఇటూ పరిగెడుతూ నానాహంగామా చేస్తున్నారు. వాళ్ళవెంట పరిగెత్తి ఆవిడికి వగర్పువచ్చేస్తోంది గానీ అగడుగ్గాయిలు అందటల్లేదు. నేను వెళ్ళుండగానే పసివాడు కాబోలు గభాల్న వాణ్ణి ఎత్తుకుని మామ్మగారికి అప్ప




జెప్పాను. తర్వాత రెండోవాణ్ణి పట్టుకోవడంలో ఆవిడకి యధాశక్తి సాయపడ్డాను. మొదట ఆదుడుకు పిండా లిద్దరికీ నామీద చాలా కోపంవచ్చినట్లుంది. బుంగమూతి పెట్టుకొని నావంక చూస్తూ నీళ్ళు పోయించుకున్నారు. అతికష్టంమీద కోపం దిగమ్రింగుకుని బట్టలు తొడిగించుకున్నారు. అప్పుడు చాక్లెట్లడబ్బా చేతిలో పెట్టాను. ఇంక చూడాలి వాళ్ళమొహాలు చిచ్చుబుడ్డికి మల్లే వెలిగాయి. నెమ్మదిగా నాచుట్టూ చేరారు ముగ్గురూ. చెవులకు పెట్టుకున్న ముత్యాల లోలకులులాగి చూశాడు చిన్నవాడు. విచిత్రంగా నా పర్సు లాక్కొని జిప్‌లాగటం రాక ఇబ్బంది పడుతున్నాడు రెండోవాడు "ఒరేయ్ః తప్పురా—ఇవతలికి రండిరా" అని కీచుగొంతుతో తమ్ముళ్ళను మందలిస్తూ తన పెద్దరికం నిలుపుకున్నాడు పెద్దవాడు. ముగ్గురు పిల్లల బుగ్గలూ ముద్దు పెట్టుకున్నాను.

కానీ ఇంత జరుగుతున్నా సుగుణమ్మగారుమటుకు ఏమీ సంబంధం లేనట్లూ అదసలు తన ఇల్లే కానట్లూ కూర్చున్నది. కనీసం గదిలోంచీ ఇవతలికైనా రాలేదు.

నేనే ఆవిడ దగ్గిరికివెళ్ళి పలకరించాను. ముభావంగా నవ్వింది నాకు

గుండెలు కోసినట్లైంది. బాగా చిక్కి పోయిందావిడ. అస్తవ్యస్తంగా వుంది జుట్టు—కాస్త నెరిసిందే మోకూడా. నల్లగా కప్పేసిన శరీరం. కళ్ళకింద గుంటలూ, విపరీతమైన నిర్లిప్తతా....

పెళ్ళికూతురుగా —కొత్తకోడలుగా—బాలెంతరాలుగా—ఇంటికి దీపంలా వెలిగిన ఆవిడ ఒక్కొక్క రూపమూ వరసగా నా మనసులో మెదిలింది — ఎందుకిలా అయిపోయిందీవిడ? ఏ బలవత్తర కారణంవల్ల? సంసారభారంవల్లనా? పెళ్ళి చేసుకున్న వాళ్ళంతా ఇలా కావటల్లేదుగా మరి—కానీ ఈవిడ పేరు—ప్చ్—

ఎవరైనాసరే సంసారభారం భుజాలపైన వేసుకుని అవలీలగా మోయగలిగే సత్తా తెచ్చుకున్న తర్వాతనే పెళ్ళి చేసుకోవాలి ప్రస్తుతకాలంలో తనే మరొకళ్ళకి బరువైనప్పుడు పెళ్ళికూడా చేసుకుని, ఏడాదికొక శిశువుని భూమిమీదకు తెచ్చి పడేసి భావిసంఘాన్ని దుఃఖాంధకారం చేయటం ఏమి సబవు?

అనుభవజ్ఞులైన పెద్దలైనా ఈ విషయం దృష్టిలో వుంచుకుని తమ పిల్లల భవిష్యత్తును ఎందుకు బాగుచెయ్యరు? ముక్కుపచ్చలారని తమ బిడ్డలకు త్వరత్వరగా పెళ్ళిళ్ళు చేసెయ్యాలనే పట్టుదల ఇంకెప్పటికి నశిస్తుంది? సీతాపతి తల్లి దండ్రులూ సుగుణమ్మగారి తల్లిదండ్రులూ భవిష్యత్తులో ఏమి ఆశించి చేశారీ పెళ్ళి? పంథొమ్మిదేళ్ళ సీతాపతినీ పధ్నాలుగేళ్ళ సుగుణమ్మగారినీ అగాధ సంసారంలో ముంచివదిలేశారే — ఆర్థికమైన ఆధారమేదీ చేతికి దొరక్క ఆ పసివాళ్ళిద్దరూ బయటికిరాలేక ఉక్కిరి బిక్కిరై పోతున్నారేమో... ప్చ్...'' అనుకుంటూ నిట్టూర్చాను

''అలా ఆలోచిస్తూ నుంచుండిపోయారేమిటి?'' అని సుగుణమ్మగారూ పలకరిస్తే ఈ లోకంలోకి వచ్చాను.

''అహ—ఏం లేదు లెండి —మీరేమిటి? అలావున్నారు?'' అంటూ మెల్లిగా ఆవిడచేతిని నాచేతిలోకి తీసుకున్నా—పక్కన కూచుని.

నేనా? బాగానేవున్నాగా? అని నవ్వబోయింది.

''బాగానే వుండటమేమిటి? అసలు నవ్వటమే మర్చిపోతేనూ — నేనూ ఈ మధ్య మీ ఇంటికి రాలేదని కోపమా. సారీ అండీ—చదువుతో తెమల్లేదు? ఇంక వచ్చేస్తాగా'' అన్నా చనువుగా

''ఎబ్బెబ్బె-అందుక్కాదండీ'' అన్నదావిడ. నొచ్చుకుని—

''మీరెందుకండీ ఎందుకిలా అయిపోయారు?''

''అంటే శారీరకంగానా? మానసికంగానా?'' నవ్వుతో తేల్చేయబోయిందావిడ.

నేనూరుకోలేదు.

''రెండువిధాలా—పోనీ శారీరకంగా చెప్పండి ముందు?'' అన్నాం.

''ఏ జేటా కాన్పులైతే ఎట్లా వుంటా

వండీ మరి" పేలవంగా దప్పరించే సింది. ఆశ్చర్యంగా చూశాను. విన్న అమ్మ చెప్పిన, సీతాపతి ఆపరేషన్ విషయంలో జరిగిన గలభాకీ ఈమాటకీ పోలిక ఎక్కడుందా?" అని.

చల్లకొచ్చి ముంత దాచటమెందుకు?

"మీకు కుటుంబ నియంత్రణమీద విముఖత అని విన్నానే అదెట్లాగబ్బా" అని అడిగా—

ఆవిడ అఘోరకంగా నవ్వి అన్నది "మావారి ఆపరేషన్ సంగతేనా అడుగుతున్నారు మరీ? ఇద్దరు పిల్లలు పుట్టగానే చెవినిల్లు గట్టుకుని పోరానండీ. ఎవరో ఒకరం ఆపరేషన్ చేయించుకుందాం. మనకి వీళ్ళిద్దరూ చాలు" అని—ఉహుం వింటేగా ఆయన సరే సరి మా అత్తగారూ మామగారూ కూడా అమ్మాయి పుట్టేదాకా ఆపరేషన్ మాట ఎత్తడానికి వీల్లేదని పట్టుబట్టి కూచున్నారు. నేనొక్కదాన్ని ఏంచెయ్యను? నా ప్రాణానికి ఆ ఆడపిల్ల ఒకత్తి పుట్టుకు రాకపోతే ఏం కొంప మునుకుపోయిందో అర్థంకాదు. అక్కడికి ఆ పిల్లకి వీళ్ళచ్చే కట్నమంతా చెడిపోయినట్లు—పెట్టే సొమ్మంతా వృధా అయినట్లు—మూడో వాడు పుట్టాక కూడా మొత్తుకున్నాను. నామాట ఎవ్వరూ విన్పించుకోలేదు. తల్లిదండ్రులమాట మీరని అపర శ్రీరామచంద్రుడాయె మా ఆయన.

అదే ఈసారి కూడా ఆడపిల్ల పుట్టక పోతే....వరసగా ఇంకో పదిమంది మగపిల్లలే పుడితే....ఏం చేసేవారు? అందుకే నాకు తగని కచ్చగా వుంది. నా మాట చెల్లకపోయె నే. నా సంసారం రెట్టింపై పోయిందే. "నేనీ పిల్లలందర్నీ ఎట్లా పెంచి పెద్దచెయ్యనో భగవంతుడా?" అని క్షోభపడీ నాలో నేను కుమిలిపోయాను. ఏదో ప్రతీకారం చెయ్యాలని విపరీతమైన తహతహ పుట్టింది. ఇంట్లో పడి మగ్గిపోయే నేను సాధించటం ఏం చెయ్యగలను? అందుకే ఇష్టం వచ్చినట్లు అందర్నీ సాధించి పెడతున్నా. వాళ్ళ మనసులు అల్లకల్లోలం చెయ్యటమే నా కోరిక" అంటూ ఆగింది.

నేను తల పంకించి వూరుకున్నాను మళ్ళీ ఆవిడే అన్నది.

"ఎందుకోనండీ ప్రతివాళ్ళనీ ఏడిపించా లనిపిస్తోంది. ఎవరైనా సుఖపడుతున్నారంటే చాలు. వాళ్ళమీద మరీ కోపం వస్తోంది. తల్లిదండ్రులూ తోబుట్టువులూ. ప్రాణమిచ్చే స్నేహితులూ ఎవ్వరూ లేరు నాకిక్కడ. మీరు కన్పిస్తుంటే ప్రాణం లేచివస్తోంది. పుష్పంలా పరిమళభరితమూ చందనంలా శీతలమూ అయిన స్నేహానికి వాచిపోయాను. మీరు కన్పించగానే నా బాధంతా మీకు చెప్పుకోవాలన్పిస్తున్నది రోజారాణీ! ఏమండీ! నన్ను చూస్తే మీకు అసహ్యం వేస్తోంది కదూ—ఎందుకొచ్చాన్రా బాబూ! ఈ దుర్మార్గురాల్ని చూడటానికి—ఛీ—ఇంకెప్పుడూ ఈ

మనిషిమొహం చూడకూడదని అన్పి స్తోందికదూ మీకు?'' అంటూ తల వంచు కున్నది.

నేను తరతరలాడిపోయాను.

''లేదు. లేదు. అట్లా అనుకోను, ఎప్పటికీ—'' అంటూ ఆప్యాయంగా ఆవిడ భుజంమీద చెయ్యివేశాను.

ఆవిడ రెండుచేతుల్లో మొహం దాచు కున్నది. దుఃఖాన్ని ఆపుకోవటానికి చేస్తున్న ప్రయత్నం తెలిసిపోతూనే వున్నది. ఆవిడ తలమీద చెయ్యివేసి రేగిన జుట్టు సవరిస్తూ ఉండిపోయాను. ఈ కాస్సేపట్లో ఎంత చేరువైపోయిం దీవిడ'' అనే నాకు ఆశ్చర్యంగా వుంది.

ఏదో గుర్తొచ్చినట్లు చివాల్న తల ఎత్తి ''ఔను గానీండి నలుగురు పిల్లలు చాలక గొడవ చేస్తున్నా ననుకున్నారా మీరు కూడా? మా అత్తగారి మాటలు విని అట్లా అనుకుని వుంటారుగదూ? నే నొకమాట చెప్తున్నా వినండి నలుగు ర్నేమిటి నా మొహం—నా తాహతుకి ఒక్కళ్ళని కనే హక్కు కూడా లేదు'' అన్నది.

''మీరేదో మనసులో పెట్టుకుని బాధ పడుతున్నారు.'' అన్నా విచలితురాలినై పోతూ. ''బాధకాక ఇంకేమిటండీ. నన్ను నిలువునా అన్యాయం చేశారు అందరూ కలిసి—నేను చదువుకుంటానో అని గోలపెట్టినా వినిపించుకోకుండా ఫోర్త్ ఫారంతో ఆపేయించారు అమ్మా నాన్నా. తర్వాత నన్నిక్కడికి తీసుకువచ్చి వీళ్ళ కప్పజెప్పి వెళ్ళిపోయాడు నాన్న—మా ఆయన తెలివితక్కువ మనిషైనా పోనీ ఏదో ఆస్థివుందిగదా వెనకాల ఫర్వాలేదను కున్నాను మొదట—అదంతా ఇన్నాళ్ళ నించీ హారతీ కర్పూరంలా హరించుకు పోయింది'' అన్నదావిడ.


ఆశ్చర్యంగా చూశాను.

''ఔనండీ మరి. కూచునితింటే కొండలు తరుగుతాయంటారు. మా ఆస్తి ఒకలెఖ్ఖా? ఇంక యిప్పటికి మిగిలినవి సొంత యిల్లూ, మా అత్తగారి దగ్గిరున్న ఆరు కాసుల బంగారం, నాకు పెళ్ళిలో పెట్టిన పట్టుచీరా. రిటైరైపోయి కూడా కొడుకు సంసారం కోసం మామగారు చేస్తున్న చిన్న ఉద్యోగం, పొద్దస్తమానం ఇంట్లో కూచునే మొగుడూ, ముక్కుపచ్చ లారని నలుగురు పిల్లలూనూ—అవునా రాణీ? మా మూడోవాడు పుట్టినప్పటి నుంచీ బెంగ పెట్టుకుంది. వీళ్ళందర్నీ ఎట్లా పెంచన్రా భగవంతుడా! అని వాళ్ళనుకన్న తండ్రి చేతులు ముడుచుకుని కూర్చుంటాడాయె. ప్రేమగా దగ్గిరకైనా తీయడాయె ఆడదాన్ని నేనేం చెయ్య గలను? సరిగ్గా తిండే పెట్టలేనేమోనని భయపడి చస్తున్నాను. ఇంక చదువు లెక్కడ చెప్పించను? వీళ్ళసలు పెద్దయ్యాక సంఘంలో మనుషులుగా చెలామణీ కాగలరా? నా కడుపున పుట్టిన నేరానికి నా బిడ్డలకేంగతిపట్టనున్నదో?''

మామగారూ అత్తగారూ కూడా బాగా పెద్దవాళ్ళైపోయినారే పాపం డెబ్బయ్యేళ్ళ ఈ వయసులో కూడా ఆ ముసలాయన కొడుకు సంసారంకోసం కష్టపడుతున్నా రంటే నా ప్రాణం ఎంత కొట్టుకుపోతోందో చెప్పలేనురాణీ! పాపం మా అత్తగారుసుటుకు యెంత అవస్థపడుతున్నారు" అంటూ ఆవేదనపడిందావిడ.

నేనీ సారికూడా ఏం ప్రశ్నలు వెయ్యకుండా వినదలుచుకున్నాను. ఎన్నాళ్ళనించో ఆ ఇల్లాలి గుండెల్లో గూడుకట్టి బయటి దుష్టపరిమాణాలను కలిపిస్తున్న ఈ క్షోభ పూర్తిగా కరిగి నిర్మలమైపోయేదాకా వినాలి" అనుకున్నాను.

"మా ఆయనఅస లేపనీ చెయ్యలేరు. చెయ్యరు కూడా బజారు సరుకులు కూడా తెచ్చిపెట్టరు తగనిబద్ధకం. ఆ ఎస్సెల్సీ పూర్తి చెయ్యమని యెంతపోరినా వినరు. పాపం మా అత్తగారే ఇంటిచాకిరీ అంతా చేస్తున్నారు. కానీ నాకు ఒళ్ళు మండుతున్నది. అనుభవించాలిసిందే లెండి ఇంతకు ఇంతా" అన్నది.



"ఆవిడ చేసిన నేరమేమిటంటారు?" నవ్వుతూనే అడిగా ఉండబట్టలేక. "ఆటు కొడుక్కి తగుదునమ్మా అంటూ పెళ్లిందుకు చెయ్యాలి? అందుకనేనా యిన్ని తిప్పలూ జిలేబీచుట్టలూ మెలికలూ. సన్యాసి కథ చెప్తుంటారు చూడండి "కౌపీన సంరక్షణార్థం అయం పటాటోపః" అని అట్లావుంది పోగి ఆ కొడుకు భవిష్యత్తు ఆలోచించి, బుద్ధిచెప్పి లక్షణంగా చదువు చెప్పించ లేక పోయారూ? వెయ్యి అక్కర్లేదు. అయిదొందలు అక్కర్లేదు. నేకు ఒక్క వంద

రూపాయలు ఆయన తెగలిగితే యెంత బావుండేది? ఎంత విశ్రాంతగా, యెంత హాయిగా వుండేది! చెప్పండి. ఈ ముసలి వాళ్ళిద్దరూ పోయాక మా గతి యేం కావాలి? అలో లక్ష్మణా! అని పిల్లలు నా యెదానబడి ఏడుస్తూంటే నేను యెవ రింట్లో అడుక్కు తినాలి? ఏమిటోనండీ నాకు భవిష్యత్తు తలుచుకుంటే గుండె బద్దలౌతోంది'' అంటూ బావురుమన్నది సుగుణమ్మగారు.

నామనస్సు గిజగిజ తన్నుకోసాగింది.

''ఊరుకోండి'' అంటూ కన్నీళ్ళు తుడిచి ఆదరంగా సమాశ్వాసించాను. ఆవిడ తేరుకున్నా మొదలు పెట్టానిం పాదిగా

''సరే పోనీండి. జరిగిందేదో జరిగింది. దాన్నింక మనం మార్చలేము గదా జరగబోయేదాన్ని గురించి జాగ్రత్తగా—సక్రమమైనరీతిలో ఆలోచించాలి అంతే. ఇప్పటికైనా మించి పోయిందిలేదు. నేనొకటి చెప్తాను. దాన్ని గురించి బాగా ఆలోచించుకుని మీ నిర్ణయం నాకు తెలియజెయ్యండి—'' అన్నా.

''అయ్యో! అంతకన్నానా? చెప్పండి రాణీ! చక్కగా చదువుకుని పైకి వచ్చారు మీరు. పూర్వజన్మలో ఎంత పుణ్యం చేసుకున్నారో—మీరు సలహా చెప్పడమూనూ మాబోటివాళ్ళం ఆలోచించటమూనా? ఏం అక్కర్లేదు. వెంటనే ఒప్పేసుకోవటమే'' అన్నదావిడ.

''అదుగో, ఇతరులని ఆకాశాని కెత్తేసి మనం పాతాళానికి క్రుంగిపోవటం వల్లనే సగం అనర్థాలు జరుగుతున్నాయి మన సంసారాల్లో. ఆత్మ స్థైర్యమన్నది ముఖ్యంగా వుండాలి మనకు. మీకంటే నేనెలా అదృష్ట వంతురాలి నౌతానంటే మరీని పనసపళ్ళలాంటి మీనలుగురు బిడ్డలతో సమానం అవుతుందానా ఎమ్మెస్సీ డిగ్రీ'' అన్నా నవ్వేస్తూ.

''సరే.... దేనికదే. ఉండండి మా పసివాణ్ని చూపిస్తాను'' అంటూ ఉయ్యాల్లోనించి తీసుకువచ్చింది ''ఒళ్ళో పడుకో బెట్టవచ్చునా? ఇంకా భయమేనా?'' అని అడిగింది సరదాగా. ఆవిడ మొహాన లీలగా తోచిన హాసరేఖచూసి నేనూ నవ్వాను—చెప్పొద్దూ ఇప్పటికిగాని నా ప్రాణం తెరిపిన పడలేదు.

''ఫర్వాలేదు. ఎత్తుకుంటానిలా ఇవ్వండి. అబ్బో! అబ్బో! ముద్దొస్తున్నాదండోయ్ మీ చిన్న తల్లి. ఈ పాపాయిని చూసి మరిచి పోవచ్చుగదండీ మీ బాధలన్నీ. భగవంతుడిచ్చిన మహా ప్రసాదంగదా ఈ బంగారుబొమ్మ. ఏమ్మా బుజ్జీ! నీకోసం ఇంట్లో ఎంత గొడవై పోయిందో చూశావా? నీ భవిష్యత్తు గురించి భయపడుతోందమ్మా మీ అమ్మ నువ్వు కొంచెం పెద్దదానివై అమ్మకు ధైర్యం చెప్పాలి'' అంటూ ముద్దు పెట్టు

ము వ

కున్నాను. పాప బొద్దుగా మిసమిసలాడు తోంది—చిట్టిచేతులు చాపి నామెళ్ళోని పొడుగాటి గొలుసుకు వేసుకున్న లాకెట్ అందుకుంది. దాన్ని పట్టుకుని ఉత్సాహంగా కేరింతాలు కొడుతోంది. నేను తెచ్చిన సిల్కుగౌను వేస్తూ పేరేం పెట్టారని అడిగాను.

"ప్చ్. ఏం పెట్టలేదండీ. అనవసరంగా పుట్టినపిల్ల. దాన్నిగురించి నాకు పట్టించుకోవాలనిపించటం లేదు" అన్నది ఎటోచూస్తూ.

"ఛా—ఏం మాటలవి? కన్నతల్లి అనవలసినవేనా? ఇలాంటి మాటలంటే నేను సహించను. ఇంకెప్పుడూ అనకండిలా" అన్నాడు కోపంగా.

"సరే లెండి—అననుగానీ—మీరే చెప్పండి ఏదైనా మంచిపేరు" అన్నది.

"నేనా? నేను చెప్పినపేరు పెట్టటానికి సీతాపతి దేవుడు వప్పుకుంటాడా?" అని అడిగా — చిన్నప్రయోజనాన్ని ఆశించి—ఆవిడసమాధానంలో" అది నెరవేరింది.

"లక్షణంగా ఒప్పుకుంటారు—ఇట్లాంటి విషయాలు ఏవైనా సరేనా మాట కాదనకండీ ఆయన" కించిద్గర్వ రేఖ మెరిసిందావిడ మాటల్లో.

"ఆహా—ఇంకేం — సీతాపతి మీ మాట మన్నిస్తాడన్న మాట. మరేమమ్మా మీరెంతో అదృష్టవంతులు. తను ఎలాంటి వాడైనా భార్యమీద జులుం చెలాయిస్తూ నానా హింసలూ పెట్టే భర్త కాలేదు మీకు. వెయ్యి నమస్కారాలు పెటుకోవాలి మీరు పరమేశ్వరుడికి—ఇలాంటి భర్తను ప్రసాదించి నందుకు. మీ పిల్లలంటారా-హాయిగా ఆరోగ్యంగా వున్నారు అత్త గారికీ మామగారికీ నేమో మీమీద మిక్కుటమైన ఆపేక్ష. ఉన్నంతలో ఆనందాన్ని చూడాలికే ప్రయత్నించాలి గానీ—దుఃఖాన్నికాదు — అలెక్షన చెప్పాలంటే మీ అంతటమీరే మీచుట్టూ దుఃఖం సృష్టించుకుంటున్నారు. అంతే ఇల్లు నరకమైనా మీనించే అవుతుంది. ఇంట్లో మీ స్థానం ఎటువంటిది? ఉన్నతోన్నతమైనది. మీరు సంతోషంగా వుంటే ఇంటిల్లి పాదినీ సంతోష పెట్టగలరు" అంటూ ఆవిడ మొహంలోకి నిశితంగా చూశాను.

నామాటలు శ్రద్ధగా వింటున్న లక్షణాలే కన్పిస్తున్నాయి. మళ్ళీ మొదలు పెట్టాను.

"మీరు అందర్నీ సాధించినందువల్ల-ఏడిపిస్తున్నందువల్ల మీకేమైనా తృప్తిగా వుందా? పోనీ మీ ఇల్లు ఏమైనా బాగుపడుతోందా? లేదుగదూ పైగా ఏమవుతోంది. దుఃఖం ఎక్కువౌతోంది. ఇల్లు అశాంతికీ, అలక్ష్మికీ నిలయమవుతోంది. అలాకావటంవల్ల మీకేంలాభం వస్తోంది? ఏం తృప్తి లభిస్తోంది? పరిస్థితిఅంతా అస్తవ్యస్త మవటంతప్ప. మీ తెలివి

జాము వ

తక్కువతనంవల్ల—మీ అసహనంవల్ల-మీ అసంతృప్తివల్ల, స్వర్గం కావలసిన మీ సంసారం ఇలా పాడైపోవటం మీ కిష్ట ముంటుందని అనుకోను. మీరు ఇలా ఈ విషయాలన్నీ ఆలోచించి వుండరు.

మీమీద నాకు పరిపూర్ణమైన సానుభూతి వున్నది. చదువు ఆపేసి—చిన్నప్పుడే పెళ్ళిచేసి పెద్దవాళ్ళు మిమ్మల్ని కష్టపెట్టినందుకు నాకూ బాధగానేవుంది—కానీ గత జలసేతు బంధనంవల్ల ప్రయోజనం వుండదు. నామాట వినండి. మీ పిల్లల్ని ఇలాంటి కలుషిత, దుఃఖపూరిత వాతావరణంలో పెంచి మరీ పాడుచెయ్యకండి. ఆర్థికంగా మీ కున్నంత ఆసరా కూడా లేని కుటుంబాలు చాలావున్నాయి. మరి వాళ్ళింక ఏమైపోవాలి? కనక మీరు ఇప్పటికైనా మేలుకోండి అవునన్నా కాదన్నా ఇది మీ ఇల్లు. మీ ఇంటిని మీరు దిద్దుకోండి. మీ పిల్లల్ని బాగుచేసుకోండి. మీ భర్తకూ అత్త మామలకూ శాంతి నివ్వండి. "నాచేతుల్లో ఏముంది?'' అని జావగారి పోయారిందాక. ఆ మాట నే నొప్పుకోను. తల్చుకుంటే. తగిన ప్రోత్సాహంవుంటే మీరెందుకు చెయ్యలేరు. మనమంటే మనకే నిరసనైతే ఆడవాళ్ళం బాగుపడేదెప్పుడు? మనం సబలలంకావాలి. మా అన్నయ్య అంటూంటాడు లెండి'' ముదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దార నేర్పించినన్ అని—'' ఆవేశంగా ఏమిటేమిటో చెప్పాను—ఆవిడకి ఎంతవరకు అర్థమైందో గాని.

"నన్నేం చెయ్యమంటారయితే?'' అని కుతూహలంగా అడిగిందావిడ. నేనన్న మాటలకు ఆమె మనసు నొచ్చుకోనందుకు సంతోషపడ్డాను.

"మీరు మళ్ళీ చదువు మొదలు పెట్టండి. ప్రైవేటుగా పరీక్షలకు వెళ్ళండి'' అన్నా ఉత్సాహంగా.

"నేనా? నేను? బాబోయ్! ఏమిటి మీరనేది?'' విపరీతమైన గాభరా తొణికిసలాడిందావిడ గొంతులో.

"అవునండీ బాబూ! మీరే, రోజూ నేను మీకు చదువు చెప్తాను. ముందు కుట్టుగూడా నేర్చుకోండి. మీ ఇంటిదగ్గిరే సెంటర్ వుందిగా మిషన్ కొనుక్కో-డానికి డబ్బు నే నిస్తాను. మీరు ఉద్యోగంలో చేరాక నెలకింత అని తీర్చుకుందురుగాని "నేనా? నేను ఉద్యోగం చేస్తానా?'' అని గుండెలు బాదుకుంటారుగా బోలిప్పుడు. నిక్షేపంగా చేస్తారు. మీ పెద్దబ్బాయి హైస్కూలు చదువుకి వచ్చేసరికి మిమ్మల్ని ఉద్యోగస్థురాలిని చేసే పూచీ నాది. సరేనా? పరిపూర్ణమైన చిత్తశుద్ధితో, తొణికిసలాడే ఆత్మ విశ్వాసంతో, చలించని పట్టుదలతో, భగవంతుడిమీద భారంవేసి—శ్రమించటం మనవంతు, ఫలితం అయినపంతు. విరాళా పూర్తులనూ, సంశయాత్మాఃమా స్వామి ఏః



గించుకుంటాడు తెలుసునా?'' అన్నా సమధిక సంతోష ఉత్సాహాలతో.

"ఏమోనండీ—నా దసలే మట్టి బుర్ర. నాకు చదువొస్తుందంటారా? నేను పాస వుతా నంటారా?'' మళ్ళీ మొదలు ఆవిడ నిరుత్సాహం.

"లక్షణంగా అవుతారు. మహారాజుగా అవుతారు. మా అందరి బుర్రలూ బంగారంతో చేసినవికావు. చదువు రావా లంటే బుర్ర బంగారమై వుండనక్కర్లేదు. మీ లక్ష్యమైన కుటుంబ సౌఖ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సర్వశక్తులూ ధార పోసి శ్రద్ధగా, పట్టుదలగా చదివితే, నిరుత్సాహాన్ని వదిలిపెట్టి కృషిచేస్తే—తప్పకుండా పాసవుతారు—సరేనా? మీ చదువు బాధ్యత అంతా నేను చూసుకుం టానుగా'' అంటూ పాపని ఆవిడకి అందించా.

అందుకుంటూ చమత్కరించిందావిడ.

"మీ ఒళ్ళో పసిపాపవుంటే మా చెడ్డ బావుందండోయ్'' అని.

''ఉంటుంది. ఉంటుంది. ఉండదూ మరి'' అంటూ చిన్నగా చెంపమీద అంటించాను.

ఆవిడ కిలకిలా నవ్వి అన్నది "అబ్బో గురువుగారి తడాఖా గొప్పగానే వుందే—రేపట్నించీ ఇట్లాగే కొట్టి చదువు చెప్తారా ఏవిటమ్మా'' అని.

''చదువు చెప్పేటప్పుడుకాదు. ఇందా కటిలా మాట్లాడితేనే కొడతా'' అన్నా నేనూ నవ్వి.

''ఆయితే పెళ్ళి మానేసి ఉద్యోగం చేస్తారా?'' అని అడిగింది.

''అవును. అన్నట్టు ఈ వూళ్ళోనే నాకు ఉద్యోగం వచ్చేటట్లుంది'' అన్నా.

''ఓయి మీ అఘాయిత్యం? చెప్పరేం మరీ? ఉండండి కాస్త పంచదార తెచ్చి మీనోట్లో పొయ్యాలి" అంటూ లేచిం

దావిడ

"అరె! ఇదేమిటి మా ఇంట్లో నవ్వులు విప్పి స్తున్నాయి. నేనేం కలగనటం లేదు గదా" అని స్వగతం పలుక్కుంటూ లోపలికి వచ్చాడు సీతాపతి

"ఇదుగో—ఈ రాణిగారి మహాత్మ్యమేనండీ. ఈవిడ వున్నచోట శాంతిగా హాయిగా వుంటుంది. ధైర్యమూ ఉత్సాహము కలుగుతాయి. కనక మనింట్లోనే అట్టే పెట్టేసుకుందాం—బంధించేసి" అని కుతూహలంగా సీతాపతికేసి తిరిగింది సుగుణమ్మగారు.

"వచ్చాం బంధించడమా ఏమిటి! మీరు నాకిచ్చే గురుదక్షిణ" అంటూ నవ్వాను.

"మరేమిటనుకున్నారు ? ఇది ఉట్టి బంధనంకాదండోయ్—ప్రేమబంధనం" అన్నదావిడ.

"పర్వాలేదు. నా కృషి వ్యర్థం కాదు. ఈవిడకు చక్కని జ్ఞానం వుంది—సమయ స్ఫూర్తి వుంది. ఈవిడకు చదువు తొందరగానే వస్తుంది. పరీక్ష ప్యాసవటం తేలిక" అనుకున్నాను.

ఇంతకీ అసలువిషయం దాచేసిన నన్ను ప్రశ్నల్లో పెట్టేసి వూరించేస్తున్నారు ఇద్దరూనూ" అన్నాడు సీతాపతి.

"మన పాపకి ఈవిడ పేరు పెట్టేసుకుంటే సరి. మరండీ—ఈవిడ నాకు చదువు చెప్తానన్నారు" అన్నది సంతోషంగా ఆవిడ.

"శలేవారేనే—అలూలేదు—చూలూ లేదు....అని. అప్పుడే ఇంత కృతజ్ఞత ప్రకటించడం ప్రారంభిస్తేనా పని అయినట్లే—ఇంతకూ మొదటిపాఠం అర్థమైందా? రేపట్నించీ ఆచరణంలో చూపించాలి సుమా మరి" అన్నాను—

"అదేమిటి? మీరు నాకివాళ చదువు మొదలు పెట్టలేదుగా—పాఠం ఎప్పుడు చెప్పారు?" అని విస్తుపోయిందావిడ.

"ఇందాకట్నించీ మీకు చెప్పిందంతా ఏమిటనుకున్నారు మరి? అదే మొదటి పాఠమూ అన్నిటికంటే ముఖ్యమైన పాఠమూనూ—మళ్ళీ చెప్పనా క్లుప్తంగా? మీ ఇంటి సుఖసంతోషాలకు మీరే బాధ్యులు—సహృదయంతో, సుప్రసన్న వదనంతో, నిర్మల మందహాసంతో విలసిల్లే ఇల్లాలు ఇంటికి దీపం! ఏమిటండీ? అట్లా చూస్తున్నా బోధపడలేదా?" అన్నా చిరునవ్వుతో.

సీతాపతి విచిత్రంగా, విస్మయంగా చూస్తున్నాడు.

కళ్ళ నీళ్ళు గిర్రున తిరిగాయి సుగుణమ్మగారికి. అన్నయ్యతో ఈ సంగతులన్నీ ఎంత తొందరగా చెప్దామా చెప్పి భేష్ అనిపించుకుందామా?" అని తహతహలాడుతూ లేచినుంచున్నా నేను.

"అవునండీ రోజారాణీ! ఈ పాఠం ఎప్పుడూ మర్చిపోను. నా కళ్ళు తెరిపించారు. దేవుడు మిమ్మల్ని చల్లగా చూస్తాడు" అంటూ భరిణతెచ్చి నా నుదుట కుంకుమ పెట్టి "వెళ్ళిరండి" అన్నది చెమ్మగిల్లిన కళ్ళతో నవ్వుతున్న పెదవులతో సుగుణమ్మగారు.